సమస్యలతో వచ్చాం.. పరిష్కరించాలి

- గ్రీవెన్స్‌లో బాధితుల మొర
- వివిధ సమస్యలపై 127 దరఖాస్తులు
- వినతులు స్వీకరించిన కలెక్టర్

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, జనవరి 27 : తమ సమస్యలు పరిష్కరించాలని బాధితులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మొరపెట్టుకున్నారు. కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి వారి నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజలు 127 దరఖాస్తులు అందించనట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాలకు సంబంధించినవి 45, కలెక్టర్‌లోని వివిధ సెక్షన్లకు సంబంధించినవి 7, జీడబ్ల్యూఎంసీవి 22, ఎంపీడీవో ఆఫీసులు 8, ఆర్‌డీవో హనుమకొండ 8, పరకాల ఆర్డీవో 3, డీపీవో 5, ఎంజీఎం దవాఖాన 5 దరఖాస్తులు రాగా, మిగిలినవి ఇతర శాఖలకు సంబంధించినవి ఉన్నాయి. కార్యక్రమంలో డీఆర్వో వైవీ గణేశ్, ఆర్డీవోలు రమేశ్ రాథోడ్, నారాయణ, డీఆర్డీవో మీన శ్రీను పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు..

కలెక్టరేట్‌లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పథకాలకు సంబంధించి ప్రజలకు సమాచారం అందించేందుకు హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. ఈ హెల్ప్ డెస్క్‌ల్లో ప్రజలకు సిబ్బంది పథకం అమలు, నిబంధనలు, దరఖాస్తు చేసే విధానం తెలియజేస్తారు.

దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలి..

గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తిచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నాలుగు పథకాలపై అధికారులతో సమీక్షించారు. రైతు భరోసాలో వ్యవసాయేతర భూములను గుర్తించాలన్నారు. రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే ఆన్‌లైన్ చేయాలన్నారు. గృహ నిర్మాణ శాఖ అధికారి రాజేందర్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కొమరయ్య పాల్గొన్నారు.

నిట్‌లో శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరు..

హనుమకొండ చౌరస్తా : నిట్ మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ (ఎంఎంటీటీసీ) ఆధ్వర్యంలో 'ఎంపవరింగ్ ఎక్స్‌లెన్స్: కాంప్రహెన్సివ్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఫర్ నాన్-అకాడమిక్ స్టాఫ్' అనే అంశంపై వారం రోజుల రెసిడెన్షియల్ షార్ట్-టర్మ్ ప్రోగ్రాం నిర్వహించారు. కలెక్టర్ ప్రావీణ్య, ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, ఎంఎంటీటీసీ-యూజీసీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ కిశోర్‌కుమార్ ప్రారంభించారు.

'డెస్క్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇవ్వాల్సిందే'

హనుమకొండ చౌరస్తా, జనవరి 27 : డెస్క్ జర్నలిస్టులను గుర్తించి అల్లం నారాయణ అక్రిడిటేషన్లు ఇప్పిస్తే ప్రస్తుత ప్రభుత్వం కోత పెట్టేందుకు సిద్ధమైందని, ఒకవేళ అదే జరిగితే పోరాటాలకు సిద్ధమని టీయూడబ్ల్యూజే (హెచ్-143) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్ హెచ్చరించారు. హెచ్-143 జిల్లా కమిటీ మొదటి కార్యవర్గ సమావేశం గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగింది. రాష్ట్ర కార్యదర్శి తడక రాజ్‌నారాయణ, జిల్లా అధ్యక్షుడు మస్కపురి సుధాకర్, ప్రధాన కార్యదర్శి అర్షం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, జనవరి 27 : హనుమకొండ టౌన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎన్జీవో కాలనీ, వేంకటేశ్వరస్వామి దేవాలయం, సంఘమిత్ర కాలనీ, శ్రీలక్ష్మి నగర్, ఓల్డ్ బాలాజీ కాలేజీ, వాటర్ ట్యాంక్ ఏరియాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

రాజేశ్వర్‌రావు (ఫైల్)

ఎల్కతుర్తి, జనవరి 27 : మండలంలోని కోతులనడుమ బ్రిడ్జిపై లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఎల్కతుర్తి ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం గ్రామానికి చెందిన బచ్చు రాజేశ్వర్‌రావు (55) తన ద్విచక్ర వాహనంపై హుజూరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కోతులనడుమ బ్రిడ్జి మీదికి రాగానే ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో రాజేశ్వర్‌రావు బైక్ పైనుంచి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం హుజూరాబాద్ దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య అరుణ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ పైనుంచి పడి బాలుడికి తీవ్ర గాయాలు..

మండలంలోని దండేపల్లి గ్రామానికి చెందిన జన్ను రితిక్ తన తండ్రితో కలిసి ద్విచక్ర వాహనం పైనుంచి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. రితిక్ తన తండ్రితో బైక్‌పై వెళ్తుండగా, ఎల్కతుర్తి గ్రామ పంచాయతీ వద్ద ముందు టైర్ పగిలింది. దీంతో ఇద్దరు కింద పోవడంతో బాలుడికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకొని ఎమర్జెన్సీ మెడికల్ ఆఫీసర్ విద్యాసాగర్, పైలట్ రాజు, ఈఆర్‌సీపీ డాక్టర్ మౌనిక బాలుడికి సీపీఆర్ చేసి అనంతరం ఎంజీఎం దవాఖానకు తరలించారు. కాగా, బాలుడి పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
jobs Apply Now!
★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327012-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

వివేకవంతమైన విద్యార్థులే దేశానికి బలం

సీబీఐ మాజీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ

హసన్‌పర్తి, జనవరి 27 : వివేకవంతమైన విద్యార్థులే దేశానికి బలం-బలగమని సీబీఐ మాజీ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని పెంబర్తి శివారులోని ఏకశిలా టెక్నో స్కూల్‌లో సోమవారం వార్షికోత్సవం నిర్వహించారు. లక్ష్మీనారాయణతో కలిసి విద్యాసంస్థల చైర్మన్ తిరుపతిరెడ్డి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఒక గోల్‌ను ఏర్పాటు చేసుకొని దాన్ని అందిపుచ్చుకునే వరకు ప్రయత్నాలు చేయాలని సూచించారు. చైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎప్పటికప్పుడు స్కిల్స్ డెవలప్ చేసుకుంటూ ముందుకు పోవాలన్నారు. సీబీఎస్సీలో475 మార్కులు, పదో తరగతిలో 10/10 సాధించిన విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తామని ప్రకటించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు గౌరు సువిజా రెడ్డి, గౌరు రాజిరెడ్డి, బేతి కొండల్‌రెడ్డి, ముచ్చు జితేందర్‌రెడ్డి, అధ్యాపకులు దినేశ్, శైలజారెడ్డి, స్వప్నారెడ్డి పాల్గొన్నారు.

కేయూలో ఘనంగా ఖేలో భారత్ క్రీడోత్సవాలు

హనుమకొండ చౌరస్తా, జనవరి 27 : కాకతీయ విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఖేలో భారత్ క్రీడోత్సవాలు ఉత్సాహంగా జరిగాయి. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు పాల్గొని పోటీలను ప్రారంభించారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. కేయూ ఇన్‌చార్జి నిమ్మల రాజేశ్, అధ్యక్షులు సాయికుమార్, గట్టు ప్రశాంత్, అంబాల కిరణ్, సంయుక్త, చెట్ల సతీశ్ పాల్గొన్నారు.

29 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

హనుమకొండ చౌరస్తా, జనవరి 27 : ఈ నెల 29వ తేదీ నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోపాల్ తెలిపారు. విద్యార్థులు పరీక్షలకు తప్పకుండా హాజరుకావాలన్నారు. జిల్లాలో మొత్తం 124 జూనియర్ కాలేజీల్లో మొదటి సంవత్సర విద్యార్థులు 20,075మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు 22,131 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉందని తెలిపారు.

చెట్టు కొట్టేసిన వ్యక్తికి రూ. 10వేల ఫైన్

అనుమతి లేకుండా చెట్టు నరికిన వ్యక్తికి జరిమానా విధిస్తున్న హార్టికల్చర్ అధికారులు

వరంగల్, జనవరి 27 : గ్రేటర్ కార్పొరేషన్ ఉద్యానవన విభాగం అనుమతులు లేకుండా చెట్లు కొట్టివేస్తే జరిమానా విధిస్తామని హార్టికల్చర్ అధికారి రమేశ్ అన్నారు. 30వ డివిజన్ బాలసముద్రం సైకిల్ పార్కింగ్‌లో చెట్టును నరికిన వ్యక్తికి బల్దియా అధికారులు సోమవారం రూ. 10వేల జరిమానా విధించారు. హార్టికల్చర్ అసిస్టెంట్లు అశ్విని, ప్రియాంక పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్యయాదవ్

'మా వాటా మాకు ఇవ్వండి'

హనుమకొండ చౌరస్తా, జనవరి 27 : రాష్ట్ర జనాభా ప్రకారం 20శాతానికి పైగా ఉన్న యాదవ కులస్తులకు తమ వాటా తమకు కల్పించాలని అఖిలభారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు గిరబోయిన రాజయ్యయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. బీసీ హక్కుల రాజ్యాధికారం కోసం 2న ఆర్ట్స్ కాలేజీ మైదానంలో జరగబోయే బీసీ రాజ్యాధికార యుద్ధభేరిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యాదవులకు రాజకీయంగా ఒక శాతం మాత్రమే ప్రాతినిధ్యం కల్పిస్తున్నారని, బడ్జెట్‌లో 0.5శాతం మాత్రమే కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధ్యక్షుడు సిద్ధిరాజు యాదవ్, కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్లావుల కుమార్‌యాదవ్, బొంగు రాజుయాదవ్, కేదరి యాదవ్, చెన్నమల్లు యాదవ్ పాల్గొన్నారు.

రైల్వే జీఎం ఏకేజైన్‌ను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యేలు

కాజీపేట సమస్యలు పరిష్కరించాలని రైల్వే జీఎం ఏకే జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

కాజీపేట, జనవరి 27 : సికింద్రాబాద్ రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, డీజీఎం ఉదయ్‌నాథ్ కోట్లను వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ.. అన్ని అర్హతలు ఉన్న కాజీపేటకు వెంటనే రైల్వే డివిజన్ హోదా కల్పించాలని కోరామన్నారు. కాజీపేట ప్రధాన రహదారి వెంట ఉన్న స్థలాన్ని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు కేటాయిస్తే నూతన బస్‌స్టేషన్ నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

గ్రీవెన్స్ అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

బల్దియా గ్రీవెన్స్‌లో కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

వరంగల్, జనవరి 27 : బల్దియా గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలపై వింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో ఆమె నగరవాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎక్కువగా ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. వరంగల్ పుప్పాలగుట్ట ప్రాంతంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని న్యాయవాది కమల్ కిశోర్ కమిషనర్‌కు విన్నవించారు. 26వ డివిజన్ పరిధిలోని రామా వారి వీధిలో రోడ్డు విస్తరణ పనులు నిలిపివేయాలని స్థానికులు కోరారు. విస్తరణలో చాలామంది నిరుపేదల ఇళ్లు సగం వరకు పోయే ప్రమాదం ఉందని వివరించారు. కాశీబుగ్గ వివేకానంద కాలనీలో మట్టి రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వెంటనే సీసీ రోడ్లు నిర్మించాలని కాలనీ వాసులు కోరారు. పోచమ్మమైదాన్ జంక్షన్‌లో పెద్ద పెద్ద కర్రలతో ఫ్లెక్సీల ఏర్పాటుతో ప్రజలకు ఇబ్బందులు కలగుతున్నాయని, మూడు రోజుల కంటే ఎక్కువ రోజులు ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ నేతలు ఫిర్యాదు చేశారు. కాకతీయ యూనివర్సిటీ కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలని కాలనీ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి రాజ సుధాకర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. 4వ డివిజన్ జ్యోతిరావు పూలే కాలనీలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మించాలని వినతిపత్రం ఇచ్చిరు. జవహర్ కాలనీ రోడ్ నంబర్-8లో డ్రైనేజీ నిర్మించాలని, కాలనీ వాసులు కంట్రిబ్యూషన్ చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని కమిషనర్‌కు విన్నవించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంలో జాప్యం లేకుండా వింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రీవెన్స్‌లో మొత్తం 85 వినతులు వచ్చాయి. టౌన్ ప్లానింగ్ విభాగానికి 42, ఇంజినీరింగ్ విభాగం 22, ప్రజారోగ్య విభాగం 13, పన్నుల విభాగం 4, తాగునీటి సరఫరా 4 వినతులు వచ్చాయి. అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, హెచ్‌వో రమేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, ఎంహెచ్‌వో రాజేశ్, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పరువు తీయకండి

కాంగ్రెస్ కార్యకర్తలపై ఎమ్మెల్యే రేవూరి అసహనం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు, జనవరి 27 : కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ పరువు తీస్తున్నారని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. సోమవారం ఆత్మకూరులో విద్యుత్ వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలకు మధ్య సమన్వయ లేకపోవడం వల్ల ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, దీంతో పార్టీ పరువు పోతున్నదన్నారు. ఓపికతో ఉండాలని హితువు పలికారు. గ్రామాల్లో మళ్లీ ఒకరిపై ఒకరు దుష్ప్రచారం చేసుకున్నట్లు తమ దృష్టికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణకు సోలార్ ప్రాజెక్టు..

పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నదని ఎమ్మెల్యే రేవూరి అన్నారు. ఆత్మకూరు గ్రామాన్ని సోలార్ విద్యుత్ ఉత్పత్తి పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయగా, ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి సంబంధిత అధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఆత్మకూరులో 1,825 గృహ సర్వీస్‌లకు సుమారు రూ.20 కోట్ల అంచనా వ్యయంతో సోలార్ పవర్ ప్యానెళ్లను 100 శాతం సబ్సిడీతో ఇస్తున్నామని, రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఈ వెంకటరమణ, డీఈ సౌమ్యనాయక్, ఏడీ దేవేందర్ నాయక్, డీఎం మహేందర్‌రెడ్డి, ఏఈలు వెంకటేశ్వర్లు, ఏసీపీ సతీశ్‌బాబు, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలి

శాయంపేట, జనవరి 27 : బీసీ విద్యార్థుల పొట్టగొడుతున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వెంటనే రద్దు చేయాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి ముంజాల రాజేందర్, రాష్ట్ర మహిళా ఉపాధ్యాక్షురాలు ఏరుకొండ హైమావతి, జిల్లా ఇన్‌చార్జి గోవిందుల జనార్దన్ అన్నారు. శాయంపేటలో సోమవారం బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర వ్యవస్థాపక నాయకుడు దామెరకొండ కొమురయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ.. దేశంలో అరవై శాతం ఉన్న బీసీలకు సరైన రిజర్వేషన్లు లేక అన్యాయం జరుగుతున్నదన్నారు. బీసీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు పోరాటం చేయాలన్నారు. ఫిబ్రవరి 2న ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌లో జరిగే బీసీ గర్జనను విజయవంతం చేయాలన్నారు. అనంతరం సమితి మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా ఉప్పు నర్సయ్య, ఉపాధ్యక్షులుగా కోల శ్రీను, మాడిశెట్టి చిరంజీవి, మండల ప్రధాన కార్యదర్శిగా అడప ప్రభాకర్, అధికార ప్రతినిధిగా నూనె శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా చేరాల రాకేశ్‌ను ఎన్నికయ్యారు.

సభా వేదికపైకి కోడిగుడ్లు విసిరిన యువకుడి అరెస్టు

శాయంపేట, జనవరి 27 : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో ఆదివారం రాత్రి ప్రభుత్వం నిర్వహించిన సంక్షేమ పథకాల ప్రారంభోత్సవ సభా వేదికపైకి కోడిగుడ్లు విసిరిన యువకుడిని అరెస్టు చేసినట్లు శాయంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌రావు సోమవారం తెలిపారు. పథకాల ప్రారంభోత్సవ సభలో మద్యం మత్తులో అదే గ్రామానికి చెందిన బొమ్మకంటి ప్రశాంత్ స్టేజీపైకి కోడిగుడ్లతో దాడి చేసినట్లు చెప్పారు. అతడిపై కేసు నమోదు చేసి పరకాల కోర్టులో హాజరు పర్చగా మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఎస్సై జక్కుల పరమేశ్ ఉన్నారు.

మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి మృతి

నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే చల్లా

నారాయణరెడ్డి(ఫైల్)

శాయంపేట, జనవరి 27 : మండలంలోని కొప్పుల మాజీ సర్పంచ్ గోలి నారాయణరెడ్డి(90) సోమవారం మృతి చెందారు. నారాయణరెడ్డి 21 సంవత్సరాలు సర్పంచ్‌గా పనిచేశారు. ఇందులో రెండు సార్లు ఏకగ్రీవంగా ఎన్నికై గ్రామ అభివృద్ధికి కృషి చేశారు. గ్రామానికి కరెంటు తీసుకురావడంతో పాటు దళితులకు 60 ఎకరాలు పంచరాయి భూములను ఇప్పించారు. నారాయణరెడ్డికి నలుగురు కుమార్తెలు, కొడుకు ఉన్నారు. కాగా, విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కొప్పులకు చేరుకుని నారాయణరెడ్డి భౌతికకాయం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యపాల్‌రెడ్డి నారాయణరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆమె వెంట మొగిలి, రామకృష్ణ ఉన్నారు.

మాజీ వైస్ చైర్మన్‌కు పరామర్శ..

పరకాల : మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే చల్లా పరామర్శించారు. విజయపాల్‌రెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి సోమవారం మృతి చెందాడు. వెంకట్‌రెడ్డి మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించిన చల్లా అంతిమయాత్రలో పాల్గొన్నారు.

నేడు కొత్తకొండ జాతర హుండీ ఆదాయం లెక్కింపు

భీమదేవరపల్లి, జనవరి 27 : కొత్తకొండ వీరభద్రస్వామి జాతర హుండీ ఆదాయం మంగళవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. ఈ నెల 10 నుంచి 18వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరిగాయి. ఇందులో భాగంగా హుండీ ఆదాయం లెక్కిస్తామన్నారు.

సుమతీరెడ్డిలో మన మహోత్సవం

మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి

హసన్‌పర్తి, జనవరి 27 : అనంతసాగర్ శివారులోని సుమతీరెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం మన మహోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి మొక్కలు నాటి నీరు పోశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మహేందర్, శశికుమార్‌రెడ్డి, రవికిరణ్, ఏవో వేణుగోపాలస్వామి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బండా ప్రకాశ్

బీసీ రాజకీయ యుద్ధభేరికి ముదిరాజ్ సభ మద్దతు

శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

హనుమకొండ, జనవరి 27 : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ చేసిన కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 2న సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహిస్తున్న బీసీ రాజకీయ యుద్ధభేరికి తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు బీసీ రిజర్వేషన్లపై హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల పేరట కాలయాపన చేస్తున్నదని ఆరోపించారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ సైతం కులగణన పక్కకు పడేశారన్నారు. బీసీ నిరుద్యోగులకు శాపంగా మారిన ఈడబ్ల్యూఎస్‌ను రద్దు చేయాలని, ఎస్సీ, ఎస్టీల మాదిరిగా బీసీ అట్రాసిటీ చట్టం తీసుకురావాలని, బీసీలకు ఫీ రీయింబర్స్‌మెంట్ పూర్తిగా ప్రభుత్వాలే చెల్లించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, అర్బన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి భయ్యస్వామి, పులి రజనీకాంత్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు జోరిక సదయ్య, జనగామ జిల్లా అధ్యక్షుడు నీలగట్టయ్య, మత్స్యశాఖ సొసైటీ చైర్మన్ చొప్పరి సోమయ్య, నీల రాజు, ఎన్నారై అధ్యక్షుడు రాజ్‌కుమార్, హనుమకొండ మహిళా అధ్యక్షురాలు పిట్టల శ్రీలత పాల్గొన్నారు.

యుద్ధభేరి ప్రచార రథాలు ప్రారంభం

ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న సుందర్‌రాజ్ యాదవ్

హనుమకొండ, జనవరి 27 : హలో బీసీ, చలో వరంగల్ నినాదంతో ఫిబ్రవరి 2న ఆర్ట్స్ కళాశాల వేదికగా నిర్వహించనున్న 'రాజకీయ యుద్ధభేరి' ప్రచార వాహనాలను సోమవారం హనుమకొండలోని బీసీ భవన్‌లో బీసీ నేత, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ జెండా ఊపి ప్రారంభించారు. వరంగల్, హనుమకొండ, కాజీపే